


# పిచ్చివాడి పరుగు



స్లోగన్లకి జనం స్పందించే రోజులు పోయే యనిపించింది రావుగారికి.

డెబ్బయి వసంతాల జీవితాన్ని చవి చూసిన రావుగారికి ఇప్పటి వినాదాల్లోని నిజాయితీ మీద, నాయకుల్లోని మంచితనం మీద సామాన్య జనానికి నమ్మకాలు పోయేయన్పించింది. వీళ్ళకి కావల్సిందొకటి, జరుగుతున్నది వొకటి. వీళ్ళు కోరుకునే దొకటి నాయకులు చేయాలనుకునే దొకటి. వీళ్ళ ఆశలు వేరు, నాయకుల వ్యూహాలు వేరు.

మార్కెటు నుంచి ఇంటికి వచ్చినప్పటి నుంచి రావుగారి మెదడ్లో ఇవే ఆలోచనలు. మార్కెటులో జరిగిన ఒక సంఘటన ఆయన్ని ఎంతగా కదిలించి వేసింది.

మార్కెట్లో ఆయన ఒక పిచ్చివాడ్ని చూశారు. వాడు వంటి మీద గోచి తప్ప మరే ఆచ్ఛాదనా లేకుండా అటెటో పరిగెడుతున్నాడు. వాడెందుకలా పరిగెడుతున్నాడో తెలుసుకోవాలనిపించి తన వెనుకే వస్తున్న రామ్మూర్తిని ఆపి అడిగాడు. దానికి రామ్మూర్తి దిగాలుగా చూసి తనకి అక్కరలేని విషయం అన్నట్లు –

"పిచ్చివాడు గదండీ- ఎందుకలా పరిగెడుతున్నాడంటే ఏం చెప్పగలం" అన్నాడు.

మాసినగడ్డంతో, చేతిలో కూరగాయల సంచితో నిల్చున్న రామ్మూర్తిలో ఈ దేశపు సగటు మనిషి కనిపించేడు. ఈ మధ్య వచ్చిన కంప్యూటర్ వల్ల వుద్యోగం పోగొట్టుకున్న మాజీ ఉద్యోగి అతను.

సంచినిండా నిండని కూరగాయల్ని తేలిగ్గా మోస్తూ రామ్మూర్తి అంటున్నాడు "ప్రతినిత్యం ఏదో ఒక సమస్యతో సతమతమయ్యే మనకి ఆ పిచ్చివాడ్ని గురించి ఆలోచించే తీరికెక్కడిదండీ- చూడండి-నిన్నగాక నిన్న కిలో రెండు రూపాయిలు పలికిన వంకాయలు ఇవ్వేళ్టికివాళ నాలుగు రూపాయలయ్యాయి. రోజు రోజుకీ దోపిడీ పెరిగిపోతోంది. అసలు ఏ విషయాన్ని మనం ప్రశాంతంగా ఆలోచించ గల్గుతున్నాం చెప్పండి? ఇప్పటివరకు నిరుద్యోగ సమస్య సమస్యగా వుండేది. కానీ రోజు రోజుకీ పెరుగుతున్న కంప్యూటర్ల వల్ల ఇప్పుడు ఎవడి కాళ్ళకిందకి నీళ్ళొస్తాయో తెలియకుండా వుంది. అసలు మనం ముందుకెళుతున్నామో, వెనక్కి వెళుతున్నామో అర్థం కావట్లేదు. హు"

అతని ఆవేశం నిజ మేననిపించింది రావుగారికి.

వాళ్ళు మాట్లాడుతుంటే ఆ పిచ్చివాడు మళ్ళీ ఇటువైపే పరిగెట్టుకుంటూ వస్తున్నాడు.

రావుగారు రామ్మూర్తిని ప్రశ్నించే ధైర్యం లేక తనలోనే గొణుక్కున్నారు.

"వాడు మళ్ళీ ఇటు ఎందుకు వస్తున్నట్లో"

తనని ప్రశ్నించకపోయినా జవాబు మాత్రం చెప్పేడు రామ్మూర్తి "బహుశా ఇరవయ్యొకటో శతాబ్దంలోకి అటు వెళ్ళాలో, ఇటు వెళ్ళాలో తెలీకేమో!"

షాక్ తిన్న రావుగారు రామ్మూర్తినే చూస్తుండిపోయారు.

—వైబోయిన సత్యనారాయణ